నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

III | హైదరాబాద్, శుక్రవారం 13 సెప్టెంబర్ 2024 | HYDERABAD




సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వద్ద బైఠాయించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు



సైబరాబాద్ కమిషనరేట్ వద్ద ఎమ్మెల్యే హరీశ్‌రావును అరెస్టు చేసి.. తరలిస్తున్న పోలీసులు

# గాంధీ.. గూండాగిరి

## బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి

- పట్టపగలు.. నగరం నడిబొడ్డున
- హౌస్ అరెస్ట్ చేసి.. ఘర్షణకు ఉసిగొల్పి..
- మందీమార్బలంతో వాహనాల్లో వచ్చి..
- గేట్లపై నుంచి దూకి.. ఇంట్లోకి ప్రవేశించి..
- రాళ్లు రువ్వి.. గుడ్లు విసిరి.. టమాటాలతో దాడి
- ఇంటి అద్దాలు.. పూల కుండీలు ధ్వంసం
- కుర్చీలన్నీ చెల్లాచెదరు చేసి..

- యుద్ధవాతావరణం సృష్టించిన కాంగ్రెస్
- సిటీలో అదుపుతప్పిన శాంతిభద్రతలు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు కరువైన భద్రత
- దాడిని ఖండించిన నగరవాసులు
- రౌడీ రాజకీయాలకు స్వస్తి చెప్పాలని డిమాండ్

**ప్రజాస్వామ్యం అపహాస్యమైందంటూ..**

**రేవంత్‌రెడ్డి పాలనపై ధ్వజం**

## రౌడీ రాజకీయం

**సిటీ రౌడీ రాజకీయాలకు** అడ్డాగా మారిందా.. ? హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయా..? అంటే అవుననే సమాధానం వస్తున్నది. పట్టపగలు..నగరం నడిబొడ్డున.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అనుచరులు, కాంగ్రెస్ గూండాలు దాడికి పాల్పడటం గురువారం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది. సవాళ్లు, ప్రతిసవాళ్ల నడుమ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ.. కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసానికి తన అనుచరులతో కలిసి వచ్చారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. అయితే అప్పటికే కౌశిక్‌రెడ్డి హౌస్ అరెస్టులో ఉండగా, గాంధీ అనుచరులు పోలీసులను తోసుకుంటూ.. ఇంట్లోకి వెళ్లేందుకు యత్నించారు. ఈ క్రమంలో గేటు దూకి కౌశిక్‌రెడ్డి ఇంట్లోకి చొచ్చుకెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలు..అక్కడే ఉన్న బీఆర్‌ఎస్ శ్రేణులపై దాడికి దిగారు. కుర్చీలన్నీ చెల్లాచెదరు చేసి..కోడిగుడ్లు, టమాటాలు విసిరేసి..ఇంటి అద్దాలు..పూల కుండీలు ధ్వంసం చేసి.. కాంగ్రెస్ శ్రేణులు యుద్ధవాతావరణాన్ని సృష్టించారు. పోలీసులపై చేయిచేసుకున్నారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే గాంధీ దాడి చేసేలా వారిని ఎగదోశారు. ఇంత జరుగుతున్నా.. గాంధీ అనుచరులు, కాంగ్రెస్ గూండాల దౌర్జన్యాన్ని పోలీసులు నిలువరించలేకపోయారు. ఇదిలా ఉంటే కౌశిక్‌రెడ్డిపై దాడిని ముక్తకంఠంతో ఖండించిన బీఆర్‌ఎస్ నేతలు.. నిరసనలతో హోరెత్తించారు. ఇదేం ప్రజాపాలన..ఇదేం ఇందిరమ్మ రాజ్యం.. అంటూ.. నిలదీశారు. తెలంగాణను రౌడీ రాజకీయాలకు అడ్డాగా మార్చారని మండిపడ్డారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని నినదించారు. మరోవైపు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు భద్రత కరువైందని.. పక్కా ప్రణాళికతోనే దాడి జరిగిందంటూ.. రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజలు సైతం ధ్వజమెత్తారు.

- సిటీబ్యూరో, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ)



దాడికి ఉసిగొల్పుతున్న ఎమ్మెల్యే గాంధీ కుమారుడు





ధ్వంసమైన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటి అద్దాలు





కౌశిక్‌రెడ్డి ఇంటి గేటును ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు



కుర్చీలు విసురుతూ.. బీభత్సం సృష్టిస్తున్న కాంగ్రెస్ గూండాలు



కౌశిక్‌రెడ్డిపై కర్రతో దాడి చేసేందుకు యత్నిస్తున్న కాంగ్రెస్ నాయకుడు



ఇదేం దౌర్జన్యకాండ!



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, వివేకానంద్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు

### పార్కింగ్ నిర్వహణకు

## టెండర్ నోటిఫికేషన్

**పార్కింగ్ దందాపై 'నమస్తే'లో కథనాలు**

**స్పందించిన హెచ్ఎండీఏ కమిషనర్**

**నమస్తే ఎఫెక్ట్**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ) : 'పార్కింగ్ దందా, కారుకు వంద... ఇదేం దందా' పేరిట ట్యాంక్ బండ్‌పై బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు పరిధిలో పార్కింగ్ అవకతవకలపై 'నమస్తే'లో వచ్చిన కథనాలపై హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ స్పందించారు. చేతివాటం ప్రదర్శించిన బీపీపీ ఇద్దరు అధికారుల ఆగడాలకు చెక్ పెట్టేలా తాజాగా టెండర్ నోటీసులు జారీ చేశారు. మూడేండ్ల కాలం పాటు పార్కింగ్ స్టాండ్ నిర్వహణకు లైసెన్స్ మంజూరు చేయగా, ఎన్టీఆర్ ఘాట్, సంజీవయ్య పార్క్, అంబేద్కర్ విగ్రహం పక్కన, సంజీవయ్య పార్క్ వద్ద ఒక ఎకరం విస్తీర్ణంలో పార్టీలు, అమ్యూజ్‌మెంట్, కన్వెన్షన్, ఈవెంట్ సౌకర్యాల స్థాపన, నిర్వహణకు అవసరమైన టెండర్లకు సంబంధించి అర్హత కలిగిన వారు ఈ నెల 27లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా, టెండర్ నోటిఫికేషన్ జారీ చేసినా, పార్కింగ్ అక్రమ వసూళ్లపై బీపీపీ అధికారులపై కమిషనర్ దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉన్నతాధికారులకు తెలియకుండానే, హెచ్ఎండీఏ కమిషనర్ పేరిట ఆదేశాలు ఉన్నాయంటూ బుకాయించి అయినవారికి కాంట్రాక్టులు కట్టబెట్టే ప్రయత్నాలకు ఇప్పటికే సంబంధిత అధికారులు తెర లేపినట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో టెండర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేలా హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ ప్రత్యేక దృష్టి పెడితే తప్ప.. సాధ్యం కాదు. లేదంటే ఎంసీ పేరిట అయినవాళ్లకు టెండర్లను కట్టబెట్టేలా ఇప్పటికే టెండర్ నోటిఫికేషన్ మాటున ప్రయత్నాలు జరుగుతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. అసలు ఇన్నాళ్లు టెండర్లు జరగకుండా నిలిపిన బీపీపీ అధికారుల పాత్రపై విచారణ చేపడితే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని అధికార వర్గాల్లో చర్చ నడుస్తున్నది.



## 'విజిలెన్స్ విభాగం'పై కమిషనర్ కన్నెర్ర

**హైడ్రాలో పనిచేస్తుండటంపై ఆగ్రహం**

**ఈనెల జీతాలు ఇవ్వొద్దంటూ..**

**ఫైనాన్స్ విభాగానికి ఆదేశాలు..?**

**'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో రిపోర్ట్ చేసి విధులు నిర్వహించాల్సిన విజిలెన్స్ విభాగంలోని కొందరు అధికారులు హైడ్రాలో పనిచేస్తుండటంపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బల్దియాకు సంబంధించిన రోజువారీ కార్యక్రమాలు, అంతర్గత విచారణల నివేదిక రూపకల్పనలో విజిలెన్స్ అధికారుల అవసరం ఉన్నప్పటికీ బాధ్యతలు మరిచి హైడ్రాలో కొంతకాలంగా పోలీసు శాఖ నుంచి వచ్చిన డిప్యుటేషన్ అధికారులు పనిచేస్తున్నారు . ఈ విషయాన్ని రెండురోజుల కిందట 'నమస్తే'లో విజిలెన్స్ ఉనికి ప్రశ్నార్థకం'..శీర్షికతో ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ మేరకు కమిషనర్ ఆమ్రపాలి విజిలెన్స్ అధికారులపై సీరియస్‌గా స్పందించారు. గురువారం బల్దియాలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు ఈ అంశాన్ని ప్రస్తావించారు. జీహెచ్ఎంసీలో పనిచేయాల్సిన కొందరు విజిలెన్స్ విభాగపు అధికారులు హైడ్రాలో పనిచేస్తున్నట్లు అదనపు కమిషనర్ నళినీ పద్మావతి కమిషనర్‌కు వివరించారు. అంతేకాకుండా హైడ్రాలో పనిచేస్తున్న వారందరినీ రిలీవ్ చేసి.. జీహెచ్ఎంసీకి వెనక్కు పంపాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు అదనపు కమిషనర్ లేఖ రాసినట్లు కూడా కమిషనర్‌కు తెలిపారు. ఈ పరిణామాలపై కమిషనర్ ఆమ్రపాలి విజిలెన్స్ విభాగం అధికారుల వ్యవహారంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైడ్రాలో పనిచేస్తున్న బల్దియా విజిలెన్స్ అధికారులకు ఈనెల జీతాలు నిలిపివేయాలంటూ బల్దియా ఫైనాన్స్ విభాగానికి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

## కాంగ్రెస్ కుట్రలపై బీఆర్‌ఎస్ పిడికిలి

### కదం తొక్కిన కేశంపేట.. సత్తాచూపిన కొత్తపేట

రంగారెడ్డి, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం వద్ద బైఠాయించిన ఎమ్మెల్యేలను అరెస్టు చేసిన సందర్భంలో పోలీసులు హైడ్రామా నడిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను అరెస్టు చేసిన పోలీసులు గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో రెండు వాహనాల్లో తీసుకెళ్లారు. అయితే బీఆర్‌ఎస్ నేతలను శ్రీశైలం హైవే మీదుగా తీసుకెళ్తున్నట్లు సమాచారం తెలియడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు, తెలంగాణ వాదులు పెద్ద ఎత్తున రోడ్లపైకి తరలివచ్చారు. అడుగడుగునా పోలీసు వాహనాలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఒక వాహనాన్ని తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావు ఉన్న మరో వాహనాన్ని షాద్ నగర్ వైపుగా మళ్లించారు. ఈ క్రమంలో కేశంపేట మండలం కొత్తపేట వద్ద రోడ్డుపై టైర్లను అడ్డంగా పెట్టి పోలీసు వాహనాన్ని బీఆర్‌ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఉద్రిక్తతల నడుమ కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు హరీశ్‌రావు, ఇతర నేతలను పోలీసులు తరలించారు. పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్‌కు తరలిరావడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసులు వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో పోలీసులు బీఆర్‌ఎస్ శ్రేణులపై లాఠీచార్జీ చేశారు. చివరకు పోలీసులు ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్‌ను కేశంపేట పోలీస్‌స్టేషన్ లోపలికి తరలించారు.

### తలకొండపల్లి పీఎస్ నుంచి ఎమ్మెల్యేలు విడుదల

తలకొండపల్లి పీఎస్‌కు తరలించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను గురువారం రాత్రి 10 గంటల సమయంలో పోలీసులు విడుదల చేశారు. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. విడుదలైన ఎమ్మెల్యేలు వివేకానంద్, బండారి లక్ష్మారెడ్డి, మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి సొంత వాహనాల్లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.



కేశంపేట పోలీస్‌స్టేషన్ వద్ద బీఆర్‌ఎస్ శ్రేణుల ఆందోళన



ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

## కాంగ్రెస్‌వి గూండా రాజకీయాలు

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ ధ్వజం**

చిక్కడపల్లి, సెప్టెంబర్ 12: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. గురువారం గాంధీనగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గూండా రాజకీయాలకు పాల్పడుతున్నదని ధ్వజమెత్తారు. ఇటీవలే ఖమ్మంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు తదితరులపై కూడా దాడి చేశారని చెప్పారు. ఎమ్మెల్యే ఇంటిపైకి వచ్చి దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.